సాక్షి
కాకినాడ
శనివారం, 25, మే, 2024



రూ.50,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి గుర్రం భూపతిరావు దంపతులు (వేమగిరి) రూ.50,116 విరాళం ఇచ్చారు.



బాధ్యత ఏజెంట్లదే

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చివరి దశ ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది. ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు చాలా కీలకం కానున్నారు. - వివరాలు 8లో

గరిష్ఠం/కనిష్ఠం 40.0°/27.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	40.0	27.0
కాకినాడ	37.3	28.6
అమలాపురం	38.0	28.0

న్యూస్‌రీల్

గురుకులాల్లో 28 నుంచి స్పాట్ అడ్మిషన్లు

కాకినాడ సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్ష నిర్వహించి, మెరిట్ ప్రాతిపదికన అడ్మిషన్లు కల్పిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమన్వయాధికారి జి.వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా మిగిలిన ఖాళీల భర్తీకి ప్రవేశ పరీక్ష రాసి సీటు పొందని, ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పి.వెంకటాపురంలోని గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి బాలురకు ఈ నెల 28న, బాలికలకు 29న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వివరించారు. అలాగే, కాకినాడ సాంబమూర్తి నగర్‌లోని గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు బాలురకు ఈ నెల 30న, బాలికలకు 31న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీ విద్యార్థులు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇంటర్‌లో ప్రవేశాలకు టెన్త్ మార్కుల జాబితాతో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను కౌన్సెలింగ్‌కు అనుమతించబోమని వెంకటరావు స్పష్టం చేశారు.

ఘనంగా చండీహోమం



వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా చండీహోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చండీహోమం ప్రారంభించారు. పూర్ణాహుతి ఘనంగా నిర్వహించి, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, సూపరింటెండెంట్ ఐవీ రామారావు, వేద పండితులు, వ్రత పురోహితులు తదితరులు హోమం, ఇతర పూజలు నిర్వహించారు. మరోవైపు సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యాన కుంకుమార్చనలు నిర్వహించారు.

నేడు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రాత పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ తిప్పేనాయక్

కాకినాడ సిటీ: డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ శనివారం నిర్వహిస్తున్న రాత పరీక్షకు ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లూ చేయాలని ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా నోడల్ అధికారి, డీఆర్‌ఓ డి.తిప్పేనాయక్ అధికారులను ఆదేశించారు. ఈ పరీక్ష నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకూ జరిగే ఈ పరీక్షకు జిల్లాలో 1,120 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరి కోసం ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి 8.30 గంటల్లోపు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే ఆయా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ, ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్రగతి ఇంజినీరింగ్ కాలేజీ, కాకినాడ అచ్యుతాపురం రైల్వే ట్రాక్ వద్ద ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్‌లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఆయా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని డీఆర్‌ఓ కోరారు. సమావేశంలో ఏపీపీఎస్సీ పరీక్షల అసిస్టెంట్ సెక్రటరీ సీహెచ్ సాయి ప్రకాష్, సెక్షన్ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డీఐఓ కె.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు వేళాయె..

- ముందస్తుకే మొగ్గు
- తుపానుల నుంచి గట్టెక్కేలా ప్రణాళిక
- సాగు లక్ష్యం 2.43 లక్షల ఎకరాలు
- లక్ష ఎకరాల్లో వెదజల్లు విధానం
- మెట్టలో దుక్కులు దున్నుతున్న రైతులు



తుని మండలం ఎస్.అన్నవరంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రకృతి విపత్తుల నుంచి గట్టెక్కే లక్ష్యంతో జిల్లాలోని రైతులు ఖరీఫ్ ముందస్తు సాగుకు సన్నద్ధమవుతున్నారు. సానుకూల వాతావరణం, ప్రభుత్వ తోడ్పాటు ఫలితంగా రబీలో రైతుల పంట పండింది. ఎకరాకు 50 బస్తాలు పైనే దిగుబడి రావడంతో వారు ఖరీఫ్ సాగుకు సంతోషంగా సిద్ధమవుతున్నారు. సాధారణంగా మన రాష్ట్రంలో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో తరచుగా వాయుగుండాలు, తుపాన్లు వస్తుంటాయి. వీటి ప్రభావంతో కురిసే అధిక వర్షాలు, ఈదురు గాలులతో చేతికందే వేళ వరి పంట నేలనంటి, నీళ్లల్లో నానిపోయి, దెబ్బ తింటోంది. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగు నీరు సకాలంలో విడుదల చేసేవారు కాదు. దీనికి వర్షాభావం వంటి పరిస్థితులు తోడయ్యేవి. ఫలితంగా అప్పట్లో ఖరీఫ్ సాగులో తీవ్ర జాప్యం జరిగేది. ఒక్కోసారి ఆగస్టు నెలాఖరుకు కూడా వరి నాట్లు వేసిన సందర్భాలున్నాయి. దీంతో ఖరీఫ్ పంట చేతికందే దశలో తుపానులు, వరదలతో రైతులు ప్రతిసారీ నష్టపోయేవారు.

ముందస్తు సాగుతో మేలు

ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. ఖరీఫ్ చివరి దశలో రైతులు పంట నష్టపోకుండా ఉండాలంటే రైతులు ముందస్తుగా సాగు చేయడం మేలని భావించారు. దీనివలన ఖరీఫ్, రబీ సాగు సకాలంలో పూర్తయ్యి, మూడో పంటకు కూడా రైతులకు అవకాశం కలుగుతుంది. ఇది వారికి ఆర్థికంగా కూడా మేలు చేస్తుందని గుర్తించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏటా జూన్ ఒకటో తేదీనే కాటన్ బ్యారేజీ నుంచి పంట కాలువలకు సాగునీరు విడుదల చేస్తున్నారు. ముందస్తుగా ఖరీఫ్ సాగు చేసేలా వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఇది విజయవంతం కావడంతో ఈ సీజన్‌లో కూడా జూన్ ఒకటో తేదీ నుంచి పంట కాలువలకు సాగునీరు విడుదల చేసేందుకు జలవనరుల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో వచ్చే భారీ వర్షాలు, వాయుగుండం, తుపానుల వంటి విపత్తులతో పంట నష్టం జరగకుండా రైతులను ప్రభుత్వం ముందస్తు సాగుకు సన్నద్ధం చేస్తోంది.

అక్కరకొచ్చిన ఇన్‌పుట్ సబ్సిడీ

గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సకాలంలో పరిహారం విడుదల చేసేందుకు యత్నించగా.. ఎన్నికల కోడ్ పేరుతో టీడీపీ అండ్ కో మోకాలడ్డింది. ఈ నెల 13న పోలింగ్ ముగియడంతో రైతులకు మేలు చేసే లక్ష్యంతో ప్రభుత్వం.. ఎన్నికల కమిషన్ అనుమతితో అర్హులైన వారి ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ములు యుద్ధప్రాతిపదికన జమ చేసింది. ఈవిధంగా జిల్లావ్యాప్తంగా 29,739 మంది రైతులకు రూ.23.11 కోట్ల మేర పరిహారం అందించింది. ఈ సొమ్ములు రానున్న ఖరీఫ్‌లో సాగు పెట్టుబడిగా ఉపయోగపడతాయని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం అందించిన పరిహారంతో ఖరీఫ్ పెట్టుబడికి అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా పోయిందని అంటున్నారు.

ఇదీ ఖరీఫ్ ప్రణాళిక

- ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 2,79,672 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో 2.43 లక్షల ఎకరాల్లో వరి, 5 వేల ఎకరాల్లో మినుములు, 2,100 ఎకరాల్లో మొక్కజొన్న, 16,672 ఎకరాల్లో పత్తి, 12 వేల ఎకరాల్లో చెరకు, 900 ఎకరాల్లో రాగులు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- జిల్లాకు 68,280 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమవుతాయని నిర్ధారించారు. వీటిని ఈ విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) సిద్ధంగా ఉంచారు.
- ఖరీఫ్‌లో రైతులు సన్న రకాల వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. అత్యధికంగా స్వర్ణ రకం (ఎంటీయూ–7029) సాగుకు సిద్ధపడుతున్నారు. దీంతో పాటు ఎంటీయూ–1318 రకంపై కూడా ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. రైతుల ఆసక్తికి తగినట్టుగానే స్వర్ణ రకం వరి వంగడాలను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంపద (ఎస్‌పీ–9558), ఎంటీయూ–1064, ఆర్‌పీ బయో–226, ఆర్‌జీఎల్–2537, ఎంటీయూ–1061 రకాలను సైతం రైతులు సాగు చేయనున్నారు. మరోవైపు పలువురు రైతులు ఖరీఫ్‌లో సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవడానికి కూడా ఎక్కువగా ఇష్టపడతారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఏ ప్రాంతంలో ఏ రకం సాగు చేస్తారనే అంచనాలతో విత్తనాలు సిద్ధం చేసే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది.
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు కలిపి ఖరీఫ్‌లో అన్ని రకాలూ కలిపి 90 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశారు. రైతులకు ముఖ్యంగా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అవసరం. ఇప్పటికే ఆర్‌బీకేల్లో 23 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. నారుమడులకు అవసరమైన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.
- జిల్లావ్యాప్తంగా గత ఖరీఫ్‌లో 35 వేల ఎకరాల్లో మాత్రమే వెదజల్లు సాగు చేపట్టగా, ఈసారి దీనిని లక్ష ఎకరాలకు పెంచేలా రైతులను వ్యవసాయ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. తద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చని అవగాహన కల్పిస్తున్నారు.

ముందస్తు సాగును ప్రోత్సహిస్తున్నాం



గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఖరీఫ్ సాగుకు జూన్ మొదటి వారంలోనే సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జూన్ 15 లోగా రైతులు నారుమడులు వేసుకోవాలి. అలా వీలు లేని రైతులు వెదజల్లు సాగు చేసుకోవాలి. జూన్ 30లోగా వరి నాట్లు పూర్తి చేసుకునేలా రైతులు సన్నద్ధం కావాలి.

– ఎన్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, కాకినాడ

సాగు ఏర్పాట్లలో రైతన్నల తలమునకలు

వాతావరణ మార్పులతో కొద్ది రోజులుగా పలు ప్రాంతాల్లో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు వేసవి దుక్కులు చేసుకుంటూ భూమిని సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. బంగాళాఖాతంలో తుపాను ఏర్పడి.. వరుసగా నాలుగైదు రోజులు వర్షాలు కురిస్తే సాగు పనుల్లో మరింతగా తలమునకలు కానున్నారు. మెట్ట ప్రాంతంలో గోదావరి కాలువలతో పాటు పిఠాపురం బ్రాంచి కెనాల్ (పీబీసీ), ఏలేరు, పంపా, తాండవ జలాశయాలు, పుష్కర ఎత్తిపోతల పథకంపై ఆధారపడిన రైతులు సాగునీటి కోసం మరో వారం పది రోజులు నిరీక్షించాల్సిందే. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని రైతులు మెట్ట దుక్కులకు ఇప్పటికే శ్రీకారం చుట్టారు. రబీ పంట ముగిసిన నేపథ్యంలో ఆ భూములను ట్రాక్టర్లతో దున్ని ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. వర్షాలు పడిన వెంటనే మరోసారి దుక్కి దున్నుకునే ఏర్పాట్లలో ఉన్నారు.

పోలీసుల మాక్ డ్రిల్



అల్లరి మూకల నియంత్రణపై పోలీసుల మాక్ డ్రిల్

కాకినాడ క్రైం: వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టంగా వ్యవహరిస్తోంది. అల్లరి మూకల నియంత్రణ, అవాంఛనీయ సంఘటనల నివారణకు ప్రత్యేక దళాలను సిద్ధం చేసింది. ఈ దళాలు శుక్రవారం మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించాయి. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆధ్వర్యాన ఈ బృందాలు కాకినాడలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నాయి. శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతున్న సున్నిత సందర్భాల్లో ఈ దళాలు రంగ ప్రవేశం చేస్తాయి. 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు చేపట్టవలసిన చర్యలు, గుమిగూడిన జన సమూహాలను చెదరగొట్టే విధానం, టియర్ గ్యాస్ ప్రయోగం, పోలీసులపై దాడులను తిప్పికొట్టడం, లాఠీచార్జి, వాటర్ కెనాన్ ప్రయోగం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అల్లరిమూకలను, ఆందోళనకారుల్ని అడ్డుకోవడం తదితర అంశాలపై 100 మందితో కూడిన క్విక్ రియాక్షన్ టీం సభ్యులు, ఆర్మ్‌డ్ రిజర్వు, శాంతిభద్రతల పోలీసులు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. అదనపు ఎస్పీ సత్యనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌ఎస్ పొగాకుకు అంతర్జాతీయంగా డిమాండ్

- బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్
- వేలం కేంద్రాల సందర్శన



నూతన వంగడాలు సరఫరా చేయాలని చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న పొగాకు రైతులు

దేవరపల్లి: అంతర్జాతీయ మార్కెట్లో భారత దేశ పొగాకుతో పాటు తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో పండిస్తున్న ఉత్తర తేలిక నేలల (ఎన్‌ఎల్‌ఎస్) పొగాకుకు మంచి డిమాండ్ ఏర్పడిందని భారత పొగాకు బోర్డు చైర్మన్ జి.యశ్వంత్ కుమార్ తెలిపారు. దేవరపల్లి వేలం కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన పొగాకు కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పొగాకు మార్కెట్లో ఈ ఏడాది రైతులకు అద్భుతమైన ధర లభిస్తోందని అన్నారు. రెండు మూడేళ్ల సగటు ధరను తీసుకుంటే ఈ ఏడాది మార్కెట్ రికార్డు స్థాయికి చేరుకుందన్నారు. కిలో సగటు ధర రూ.298 పలుకుతోందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని, మరింత వేగంగా పొగాకు అమ్ముకోవాలని సూచించారు. మనకు పోటీగా ఉన్న జింబాబ్వే, బ్రెజిల్‌లో వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో ఆ దేశాల్లో సుమారు 200 మిలియన్ల పొగాకు కొరత ఏర్పడిందన్నారు. ఈ అవకాశాన్ని మన దేశ రైతులు, కొనుగోలు సంస్థలు అందిపుచ్చుకున్నాయని చెప్పారు. మార్కెట్ ఎప్పుడూ ఒకే విధంగా ఉండదనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ప్రారంభించి దాదాపు 70 రోజులైందని, రైతులు మంచి ధర పొందగలిగారని, కొనుగోలు సంస్థలు కూడా వేలంలో ఉత్సాహంగా పాల్గొంటున్నాయని తెలిపారు. లో గ్రేడ్ పొగాకు మార్కెట్ కొంత మందకొడిగా ఉన్నప్పటికీ రైతులు నెల రోజులుగా అవకాశాలను అందిపుచ్చుకుని చాలా తెలివిగా అమ్ముకుంటున్నారని యశ్వంత్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డ్ రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య, దేవరపల్లి వేలం కేంద్రం అధికారి జీఎల్‌కే ప్రసాద్, సీనియర్ గ్రేడింగ్ అధికారి హేమస్మిత, రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, రైతు సంఘం ప్రతినిధులు సత్తి జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలు సరఫరా చేయండి

అధిక దిగుబడులు వస్తున్న కొత్త పొగాకు వంగడాలను సీటీఆర్ఐ ద్వారా సరఫరా చేయాలని చైర్మన్ యశ్వంత్ కుమార్‌కు పొగాకు రైతులు వినతిపత్రం అందజేశారు. సీటీఆర్ఐ తయారు చేసిన ఎ–3, 1353, 1350 వంగడాలు అధిక దిగుబడులు వస్తున్నాయని, ఈ వంగడాలను ఆరేళ్లుగా బయటి వ్యక్తుల నుంచి తీసుకువచ్చి తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నామని తెలిపారు. సీటీఆర్ఐ ఆమోదం ఇవ్వకపోవడంతో ఈ కొత్త వంగడాలు దొరకడం లేదని, అనుమతులు ఇప్పించి, అవసరం మేరకు విత్తనాలు సరఫరా చేయాని కోరారు. దీనిపై బోర్డు, సీటీఆర్ఐ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారు.

ప్రారంభమైన సప్లిమెంటరీ పరీక్షలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. టెన్త్ విద్యార్థులకు తొలి రోజు కాంపోజిట్ తెలుగు పేపర్–1 నిర్వహించారు. ఈ పరీక్షకు 2,215 మంది దరఖాస్తు చేసుకోగా 1,135 మంది హాజరయ్యారు. 1080 మంది పరీక్ష రాయలేదు. ఆర్‌జేడీ నాగమణి 2, డీఈఓ రమేష్ 5 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం తెలుగు–1, హిందీ–1, సంస్కృతం–1 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 3,732 మంది హాజరవగా 249 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం నిర్వహించిన తెలుగు–2, హిందీ–2, సంస్కృతం–2 పరీక్షలకు 572 మంది హాజరవగా 59 మంది గైర్హాజరయ్యారు.

ప్రశాంతంగా ఏపీ డీసెట్

కంబాల చెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఐయాన్ డిజిటల్ జోన్‌లో ఏపీ డీసెట్ శుక్రవారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరరావు తెలిపారు. స్థానిక లూథర్ గిరిలోని ఐయాన్ పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరీక్షకు 539 మందికి గాను 460 మంది హాజరయ్యారని, 79 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షలను అర్బన్ డీఐ బి.దిలీప్ కుమార్ పర్యవేక్షించారు.

కరుణించిన వరుణుడు

- జిల్లావ్యాప్తంగా దంచికొట్టిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రోహిణీ కార్తె వచ్చేస్తుంది.. వేడిగాలులు, ఎండ తీవ్రత ఏవిధంగా ఎదుర్కొనాలనుకుంటూ ఆందోళన చెందుతున్న ప్రజలపై వరుణుడు హఠాత్తుగా కరుణ వర్ష ధారలు కురిపించాడు. శనివారం నుంచి రోహిణీ కార్తె ప్రారంభం కానున్న తరుణంలో.. తీవ్ర ఎండ వేడి, ఉక్కపోతతో అల్లాడుతున్న జిల్లా ప్రజలకు శుక్రవారం కాస్త ఊరట లభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వేడిగాలులు, ఉక్కపోతతో అవస్థలు పడిన జనం.. హోరున వర్షం కురవడంతో ఒక్కసారిగా సేద తీరారు. సుమారు మూడు గంటలకు హోరుగాలి, ఉరుములతో మొదలైన వర్షం సాయంత్రం 4.30 అయినా కురుస్తూనే ఉంది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచే 36 డిగ్రీలు పైగా నమోదైన ఉష్ణోగ్రతలు.. మే మొదటి వారంలో 40 డిగ్రీలకు పైగా చేరడంతో అల్లాడిపోయారు. ఉదయం పది గంటలు దాటితే బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉండేది. ఇటువంటి తరుణంలో ఒక్కసారిగా కుండపోతగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. సాయంత్రం నుంచి రాత్రి వరకూ చిలు జల్లులు పడుతూనే ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కాకినాడతో పాటు తుని, అన్నవరం, పిఠాపురం, జగ్గంపేట, సామర్లకోట తదితర ప్రాంతాల్లో హోరున వర్షం కురిసింది. సాయంత్రం నుంచి వీచిన పెను గాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాకినాడలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులకు చెట్లు నేలకు ఒరిగిపోవడం వలన కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నేలకొరిగిన చెట్లను ఆ శాఖ సిబ్బంది తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నారు.



జలసంద్రంలా మారిన కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల ఇబ్బందులు



టూటౌన్ నూకాలమ్మ గుడి వీధిలో వర్షపు నీటిలో వెళుతున్న వాహనాలు

మామిడి రైతుకు తప్పని అవస్థలు

పెను గాలుల తాకిడికి పెద్దాపురం, జగ్గంపేట, శంఖవరం, తుని, కోటనందూరు వంటి ప్రాంతాల్లో మామిడి కాయలు నేల రాలిపోవడంతో రైతులు డీలా పడ్డారు. తయారైన మామిడి కాయలు కోసి, మార్కెట్‌కు తరలిద్దామనుకున్న తమ ఆశలు అడియాసలయ్యాయని వారు గగ్గోలు పెడుతున్నారు.

క్లుప్తంగా

బొచ్చు అధరహో



కుండలేశ్వరం వైరు వద్ద పంట కాలువ గుండంలో లభించిన బొచ్చు చేప

కాట్రేనికోన: కుండలేశ్వరం వైరు వద్ద పంట కాలువ గుండంలో సుమారు 20 కిలోల 500 గ్రాముల బరువున్న బొచ్చు చేప లభ్యమైంది. పంట కాలువకు నీరు నిలిపివేయడంతో వైరు వద్ద గుండంలోకి చేపలు చేరిపోతాయి. ఏటా వేలం పాటలు నిర్వహించి చేపలు పట్టుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ బొచ్చు చేపను కుండలేశ్వరానికి చెందిన ఓ వ్యక్తి రూ.3 వేలకు కొనుగోలు చేశాడు.

బాధ్యత ఏజెంట్లదే

- ఓట్ల లెక్కింపులో వీరు కీలకం
- ఫారం–17సీ ఎంతో ముఖ్యం
- నిబంధనలు తెలియకుంటే అయోమయమే



ఓట్ల లెక్కింపునకు చురుగ్గా జరుగుతున్న ఏర్పాట్లు

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చివరి దశ ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది. ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు చాలా కీలకం కానున్నారు. లెక్కింపు సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు ఏజెంట్లకు పూర్తి స్థాయిలో తెలియకుంటే కౌంటింగ్ ప్రక్రియ గందరగోళంగా మారే ప్రమాదం ఉంది. సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ఫారం –17సి పార్టు–2 ఎంతో కీలకమైంది. ప్రతి కౌంటింగ్ ఏజెంట్, పరిశీలకులు, సహాయ పరిశీలకులు దీనిపై అవగాహన కలిగి ఉండాలి. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం–17 సీలో పొందుపరిచిన మొత్తం ఓట్లు సరిపోల్చి చూడాలి. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గం నంబర్, పోలింగ్ కేంద్రం పేరు, ఆ పోలింగ్ కేంద్రం వినియోగించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ల గుర్తింపు నంబర్లను ఆ ఫారంలోనే నమోదు చేస్తారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల సంఖ్య, ఓటు వేయడానికి వచ్చిన ఓటర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రంలోకి వచ్చాక ఓటు వేయడానికి నిరాకరించి వెళ్లిపోయిన వారు, ఓటు వేసేందుకు పీవో అనుమతించని వారి సంఖ్య, ఓటు వేయడానికి వచ్చిన వారి సంఖ్య, ఓటింగ్ యంత్రంలో నమోదైన మొత్తం ఓట్ల సంఖ్య ఫారం–17సీలో ఉంటాయి. టెండర్ బ్యాలెట్లు, సరఫరా చేసిన పేపర్ సీళ్లు (ఓటరుకు పోలింగ్ కేందంలో ఇచ్చే రెండు రంగుల స్లిప్‌లు), సీరియల్ నంబర్లు, ఎన్ని పేపర్లు వినియోగించారు. వినియోగించని పేపరు సీళ్లు ఎన్ని తిరిగి రిటర్నింగ్ అధికారికి వెళ్లాయి? పాడైపోయిన పేపర్ సీళ్లు, సీరియల్ నంబర్ల వంటి వివరాలు ఇందులో ఉంటాయి. కౌంటింగ్‌లో ఫారం–17సీ ఏజెంట్లకు ఎంతో ఉపయోగపడుతుంది.

తేడా వస్తే..

కౌంటింగ్ సమయంలో టేబుల్ వద్దకు కంట్రోల్ యూనిట్‌తో పాటు ఫారం–17సీ, పార్టు–1 తప్పనిసరిగా తీసుకువస్తారు. ఆయా అభ్యర్థులకు సంబంధించి కౌంటింగ్ ఏజెంట్లు అంతా ఫారం–17 సీలో ఉన్న వివరాలను రాసుకోవాలి. కంట్రోల్ యూనిట్ డిస్‌ప్లే సెక్షన్‌లో చూసిన పోలైన మొత్తం ఓట్లు, ఫారం–17సీలో నమోదు చేసిన ఓట్ల సంఖ్య సమానంగా ఉండాలి. క్లరికల్ తప్పిదం, మరే కారణంతో కానీ కంట్రోల్ యూనిట్ ఫారం–17లో ఓట్ల సంఖ్యలో తేడాలు వస్తే అది వివాదాస్పదంగా మారుతుంది. అలాంటి కంట్రోల్ యూనిట్లు పక్కన ఉంచి సమాచారాన్ని రిటర్నింగ్ అధికారి ఎన్నికల కమిషన్‌కు పంపుతారు. కంట్రోల్ యూనిట్ టేబుల్‌పైకి రాగానే ఏజెంట్ల పరిశీలనకు ఉంచుతారు. ఆ కంట్రోల్ యూనిట్ ఏ పోలింగ్ కేంద్రానికి చెందినదో ఏజెంట్లు నిర్ధారించుకోవాలి.

వరుస క్రమంలో లెక్కింపు

- కౌంటింగ్ ఒక రౌండ్ పూర్తయిన వెంటనే అందులోని రెండు కంట్రోల్ యూనిట్లను జనరల్ అబ్జర్వర్ తన టేబుల్ వద్దకు తెప్పించుకుంటారు. అదనపు పరిశీలకులతో ఓట్లను లెక్కిస్తారు. కంట్రోల్ యూనిట్‌లోని ఓట్ల సంఖ్యకు ఫారం–17సీ, పార్టు–2లో కౌంటింగ్ సూపర్‌వైజర్ నమోదు చేసిన ఓట్ల సంఖ్య సమానంగా ఉంటే ఇబ్బంది లేదు. ఒకవేళ ఏదైనా తేడా వస్తే పరిశీలకుడు తనిఖీ చేసిన మిగిలిన కంట్రోల్ యూనిట్లన్నిటినీ జనరల్ అబ్జర్వర్ మరోసారి లెక్కిస్తారు.
- వివరాలు తప్పుగా నమోదు చేసిన కౌంటింగ్ పరిశీలకునిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. అసాధారణంగా ఇద్దరు అభ్యర్థులకు కౌంటింగ్‌లో ఓట్లు సమానంగా వస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రిటర్నింగ్ అధికారి లాటరీ ద్వారా ఫలితాన్ని ప్రకటిస్తారు. ఆ లాటరీలో ఎవరు గెలుపొందితే వారినే విజేతగా ప్రకటిస్తారు.

ట్యాంపరింగ్ జరిగితే..

కంట్రోల్ యూనిట్ టేబుల్ పైకి రాగానే అభ్యర్థి సీలింగ్ సెక్షన్ సక్రమంగా ఉందో లేదో కౌంటింగ్ ఏజెంట్లు, పరిశీలకులు చూసుకోవాలి. రిజల్ట్ సెక్షన్‌పై ఉన్న స్ట్రిప్ సీల్, గ్రీన్ పేపర్ సీల్ సక్రమంగా ఉన్నాయో లేదో చూడాలి. సీరియల్ నంబర్లు ఫారం–17సీలో నమోదు చేసినవే ఉండాలి. కంట్రోల్ యూనిట్ పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్‌ల ట్యాంపరింగ్ జరిగాయని గుర్తిస్తే పరిశీలకులు ఆ విషయాన్ని రిటర్నింగ్ అధికారి, అబ్జర్వర్ల దృష్టికి తీసుకెళ్లాలి. ట్యాంపరింగ్ జరగని కంట్రోల్ యూనిట్లను మాత్రమే లెక్కించాలి.

మభ్యపెట్టి రూ.6 లక్షల దోపిడీ

పిఠాపురం: బ్యాంకులో డబ్బు డ్రా చేసుకుని బయటకు వస్తున్న వ్యక్తిని మరో ఇద్దరు వ్యక్తులు కలిసి మీ డబ్బు కింద పడిపోయిందని అని చెప్పగా కింద ఉన్న నోట్లు తీసుకునే లోపు అతని వద్ద నగదుతో ఉన్న బ్యాగ్‌ను లాక్కెళ్లి పోయారు దుండగులు. పిఠాపురం స్టేట్‌బ్యాంకు వద్ద శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పిఠాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పిఠాపురం పట్టణం కొండప్ప వీధికి చెందిన నందిపాటి నారాయణమూర్తి ధాన్య కమీషన్ వ్యాపారం చేస్తుంటాడు. ఇటీవల అమ్మిన ధాన్యానికి సంబంధించి మిల్లు యజమాని బ్యాంకులో వేసిన సొమ్ము తెచ్చుకునేందుకు పిఠాపురం స్టేట్‌బ్యాంకు వద్దకు వెళ్లాడు. బ్యాంకులో తన ఖాతాలో ఉన్న రూ.6 లక్షలు తీసుకుని, తన కూడా తెచ్చుకున్న బ్యాగ్‌లో పెట్టుకుని బయటకు వచ్చాడు. తన మోటారు సైకిల్ వద్దకు వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి మీ డబ్బు కింద పడిపోయిందంటూ కింద పడి ఉన్న రూ.50 నోట్లు చూపించారు. దీంతో బ్యాగ్ ఒక చేత్తో పట్టుకుని కిందకు వంగి మరో చేత్తో కింద పడిఉన్న రూ.50 నోట్లను తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఇదే అదనుగా భావించిన ఆ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు నారాయణమూర్తి వద్ద డబ్బుతో ఉన్న బ్యాగ్‌ను ఒక్క ఉదుటున లాక్కుని పరారయ్యారు. హఠాత్ పరిణామం నుంచి తేరుకుని గట్టిగా కేకలు వేసినా ఫలితం లేక పోవడంతో బాధితుడు పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల నిండుగ.. విరుల పండగ



స్వామి, అమ్మవార్లకు పవళింపు సేవ చేస్తున్న పండితులు



స్వామి, అమ్మవార్లకు నివేదించిన పిండివంటలు, ఫలాలు



కార్యక్రమానికి విచ్చేసిన భక్తులు



సత్యదేవుడు, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

- వైభవంగా సత్యదేవుని శ్రీపుష్పయాగం
- సుగంధ సుమాలతో పరిమళించిన కల్యాణ మంటపం
- సుమధుర ఫలాలు, పిండివంటలు స్వామివారికి నివేదన

అన్నవరం : సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీపుష్పయాగం నిత్య కల్యాణ మంటపంలో కన్నుల పండువగా జరిగింది. ఒకవైపు కల్యాణ మంటపంలో అలంకరించిన పుష్ప మాలికలు...ఇంకొకవైపు రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులు ఆకట్టుకున్నాయి. నూతన పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు ధరించి కల్యాణ శోభతో ప్రకాశిస్తున్న శ్రీసత్యదేవుడు, అమ్మవారి శ్రీపుష్పయాగ మహోత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించారు.

రాత్రి 7–30కి మొదలైన వేడుక

పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా, నవ దంపతులు సత్యదేవుడు, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి కల్యాణ మంటపానికి రాత్రి ఏడు గంటలకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. నిత్యకల్యాణ మంటప వేదికపైగల వెండి సింహాసనంపై స్వామి అమ్మవార్లను, ఆ సింహాసనం పక్కనే గల మరో ఆసనంపై పెళ్లిపెద్దలు సీతారాములను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7–30 గంటలకు పండితుల మంత్రోచ్చారణతో శ్రీపుష్పయోగం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత విఘ్నేశ్వర పూజ చేశారు. అనంతరం పుణ్యాహవచనం మంత్రాలను పఠించారు. తరువాత పండితులు గర్భాదానం కార్యక్రమానికి సంబంధించిన పూజలు నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్లకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ దంపతులు నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం పండితులు ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేదాశీస్సులు అందజేశారు.

శాస్త్రోక్తంగా పవళింపు సేవ

తరువాత సర్వాంగ సుందరంగా అలంకరించిన ఊయలలో ఉంచి విష్ణుమూర్తి, లక్ష్మీదేవి అలంకరణలో గల సత్యదేవుడు, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో పూజించారు. తొమ్మిది రకాల పిండివంటలను నివేదించి పండితుల మంత్రోచ్చాటన మధ్య స్వామి, అమ్మవార్లు ఉన్న ఊయలను మూడు పర్యాయాలు ఊపారు. భక్తులు ఊయలకు ఎదురుగా ఉంచిన అద్దంలో స్వామి, అమ్మవార్ల ప్రతిబింబాలను తిలకించారు. కార్యక్రమానికి వచ్చిన మహిళలందరికీ జాకెట్టు ముక్కలను, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్య శర్మ, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, సుధీర్, దత్తాత్రేయశర్మ, వైదిక కమిటీ సభ్యుడు ఛామర్తి కన్నబాబు నిర్వహించారు. రెండేళ్ల అనంతరం భక్తుల సమక్షంలో వైభవంగా జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవాలు శ్రీపుష్పయాగంతో ముగిశాయి.

పిడుగు పడి గేదె మృతి

పిఠాపురం: మండలంలోని గోకివాడ ఏలేరు కాలువలో శుక్రవారం పిడుగు పడడంతో కాలువలో ఉన్న ఒక పాడి గేదె మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. ఉదయం ఎండ కాయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురు గాలులతో వర్షం కురవడంతో పాటు పిడుగులు పడ్డాయి. పిఠాపురం మండలం జములపల్లికి చెందిన రాయుడు శ్రీను అనే కల్లుగీత కార్మికుడికి చెందిన గేదె కాలువలో ఉండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని స్థానిక రైతులు తెలిపారు.


పారుపాక మాజీ సర్పంచ్ ఆత్మహత్య



నూకరాజేశ్వర రావు (ఫైల్)

రౌతులపూడి: మండలంలోని పారుపాక మాజీ సర్పంచ్ గాడి నూకరాజేశ్వరరావు గ్రామం శివారున కోడూరు వెళ్లే రహదారిలోని నూతిలో పడి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రౌతులపూడి మండలం పారుపాక మాజీ సర్పంచ్ గాడి నూకరాజేశ్వరరావు కొంతకాలంగా వైఎస్సార్ సీపీలో ఉంటున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన పరిణామాల్లో గ్రామంలో రాజకీయంగా తలెత్తిన వివాదాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు మరణ వాంగ్మూలంలో పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం



నాగంపల్లిలో కాలిపోయిన తాటాకిల్లు

సీతానగరం: నాగంపల్లిలో మొలపర్తి వెంకటేశులు చెందిన తాటాకిల్లు శుక్రవారం కాలిపోయింది. ఇంటిలో వంట గ్యాస్ నుంచి వచ్చిన మంటలతో ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో స్థానికులు వాటిని అదుపు చేశారు. అప్పటికే వంట సామగ్రి, మంచాలు, ఫ్యాన్లు, టీవీ, దుస్తులు కాలిబూడిదయ్యాయి. వ్యవసాయ కూలి అయిన వెంకటేశులతో పాటు ఆయన భార్య, కుమార్తె, మనవలు ఆ ఇంటిలో ఉంటున్నారు. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తినష్టం సంభవించిందని అంచనా వేస్తున్నారు. బాధితులకు తక్షణ సహాయంగా 25 కిలోల బియ్యాన్ని ఆర్ఐ లక్ష్మి అందించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల స్పెషల్ డ్రైవ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 2024 - 25 విద్యా సంవత్సరానికి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సర్వే, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి తెలిపారు. స్థానిక గంటాలమ్మగుడి వీధిలో శుక్రవారం నిర్వహించిన డ్రైవ్‌లో ఆమె పాల్గొని తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ డ్రైవ్‌లో 192 మంది విద్యార్థులను గుర్తించడం జరిగిందన్నారు. సర్వేలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ కనకబాబు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాణి, స్థానిక ఐఈఆర్పీలు డి.చిట్టి, మేరీ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై విచారణ

కడియం: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ కడియం ఎంపీపీ పుట్టిన రోజు వేడుకలను ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించడంపై వివరణ ఇవ్వాలని ఎంపీడీవో రాజ్ మనోజ్‌ను జేసీ తేజ్‌భరత్ ఆదేశించారు. దీనిపై విచారణ చేసి ఎంపీడీవో నివేదిక ఇవ్వనున్నారు. అయితే మండల స్థాయి ప్రభుత్వ అధికారులే శుభాకాంక్షలు తెలిపారన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో తిరిగి మండల స్థాయి అధికారినే నివేదిక ఇవ్వాలని కోరడం పట్ల పలువురు ప్రతిపక్ష పార్టీల నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

విషాదం నింపిన విహారం

- గోదావరి నదిలో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి
- స్నేహితులతో కలిసి స్నానానికి దిగి నీట మునక
- మృతుడు తాడేపల్లిగూడెం వాసి



సత్తార్ మృతదేహం

కొవ్వూరు: విజేశ్వరం ఆనకట్ట వద్ద సరదాగా స్నేహితులతో గోదావరి నదిలో స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తు నీటమునిగి తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ఎస్‌కే సత్తార్ (31) మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం ఎస్‌కే మదీన్‌షా, ఎస్‌కే అబ్దుల్ రెహమాన్‌లతో కలిసి సరదాగా విజ్జేశ్వరం ఆనకట్ట వద్దకు వచ్చారు. బ్యారేజీ దిగువన స్నానాలకు దిగారు. కాలు జారడంతో నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు రక్షించి ఒడ్డుకు చేర్చగా అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. రూరల్ ఎస్సై కె.సుధాకర్‌కి సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు తాడేపల్లిగూడెంలోని తొమ్మిదో వార్డు పరిధిలోని సాలిపేటకి చెందిన వాడని ఎస్సై తెలిపారు. పట్టణంలో మటన్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్యాయత్నం

గొల్లపుంత లే అవుట్‌లో పెట్రోలు పోసుకుని నిప్పు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవి

మండపేట: ప్రేమించిన అమ్మాయి కాదన్నదని ఓ యువకుడు పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో జరిగింది. స్థానికులు బాధితుని స్నేహితులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.. మండపేట మండలం ఏడిద సీతానగరం గ్రామానికి చెందిన బోణం రవి ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఈ నేపథ్యంలో పది రోజులుగా మతిస్థిమితం లేని వాడిలా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గొల్లపుంత రోడ్డులోని ఓ ప్రైవేటు లేవుట్‌లోకి వచ్చాడు. కాసేపటికి ఎర్రటి మంటలు ఎగసిపడగా బాబోయ్ బాబోయ్ అంటూ కేకలు వినిపించాయి. దీంతో చుట్టుపక్కల వారు చూసి వెంటనే స్పందించారు. పరుగెత్తుకుంటూ వెళ్లి మంటలను ఆర్పారు. అప్పటికే ఆ యువకుడి శరీరం కాలి పోయింది. బైక్‌పై ఎక్కించుకుని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ యువకుడు వారం క్రితం నిద్ర మాత్రలు కూడా మింగినట్టు స్నేహితులు చెబుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొంది బయటకు వచ్చాక మళ్లీ ఈ పనికి ఒడిగట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ‘సాక్షి’ టౌన్ సీఐ షేక్ అఖిల్ జమకు వివరించగా ఆయన వెంటనే స్పందించి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.

విద్యార్థిని పీహెచ్‌డీకి మానవత ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అర్హులైన పేదలకు విద్య, వైద్యం తదితర విషయాల్లో సహాయ సహకారాలు అందించేందుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిరంతరం సిద్ధంగా ఉంటుందని ఆ సంస్థ రీజినల్ చైర్మన్, సీపీ మోటార్స్ అధినేత చింతా ప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం రాజమహేంద్రవరం మానవత శాఖ మెరిట్ స్కాలర్ షిప్ పథకం ద్వారా పి.భాను దీపిక అనే విద్యార్థినికి రూ.20,906 ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఆమె ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ ఓషనోగ్రఫీలో ప్రథమధమ స్థానంలో నిలిచి అదే విభాగంలో గోవాలో పీహెచ్‌డీ చదువుతోంది. ఈ సందర్భంగా ప్రసాద రెడ్డి మాట్లాడుతూ మానవత సేవా సంస్థ ద్వారా అర్హులను గుర్తించి సహాయం అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. చింతా ప్రభాకరరెడ్డి, బూరగడ్డ మురళి, కేవీఎస్ గాంధీ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లో వ్యక్తి మృతి



తుని ప్లాట్‌ఫారంపై శవాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

తుని: స్థానిక రైల్వేస్టేషన్లో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్‌మారూఫ్ శుక్రవారం తెలిపారు. విశాఖపట్నం కురుపాం మార్కెట్ ప్రాంతానికి చెందిన ముదుపాక భాస్కరరావు కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి వెళ్లడానికి తనతో పనిచేస్తున్న వర్కర్‌తో కలిసి రైలులో ప్రయాణిస్తూ అస్వస్థతకు గురయ్యాడు. ప్రయాణికుల సహాయంతో తుని రైల్వేస్టేషన్లో ఒకటో నంబర్ ప్లాట్ ఫారంపై దిగి కొద్దిసేపటికే మృతి చెందాడు. పోస్టమార్టం అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించినట్లు జీఆర్పీ ఎస్సై మారూఫ్ తెలిపారు.

తాడి చెట్టు నుంచి పడి ...



మృతుడు పోశయ్య

మలికిపురం: మండలంలోని గుడిమెల్లంక గ్రా మంలో శుక్రవారం తాడి చెట్టుపై ముంజెకాయలు కొడుతూ ప్రమాదవశాత్తూ కింద పడి దింపు కార్మికుడు పింద్రాల పోశయ్య (40) మృతి చెందాడు. మృతుడి స్వస్థలం ప్రత్తిపాడు. ఉపాధి కోసం ఇక్కడకు ఏడాది క్రితం వచ్చినట్టు స్థానికులు తెలిపారు. భార్య దుర్గ మలికిపురంలో పనస తొనల ను అమ్ముకుంటూ కుటుంబ పోషణ చేస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య దుర్గా ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఆయన వివరించారు.

రైలు ప్రమాదంలో...

తుని: రైలు నుంచి వ్యక్తి జారిపడి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ శుక్రవారం తెలిపారు. గుల్లిపాడు–తుని రైల్వేస్టేషన్ల మధ్య పాయకరావుపేట హైవే బ్రిడ్జి వద్ద విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లే రైలుబండి నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి 40 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడు. మృతుడు స్కైబ్లూ జీన్స్‌ప్యాంటు, స్లీవ్‌లెస్ బనియన్ ధరించి ఉన్నాడు. మృతుడి దగ్గర లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 19020 నంబరులో సంప్రదించాలన్నారు.